క్లుప్తంగా

రుణాల కోసం దరఖాస్తు చేసుకోవాలి

తాళ్లూరు: ఆంధ్రప్రదేశ్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ రుణాల కోసం ఆన్‌లైన్లో ఓబీఎంఎంఎస్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఎంపీడీవో దారా హనుమంతురావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని బొద్దికూరపాడులో ఉన్న ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్ పరిధిలో స్లాబ్–1 కింద 3 యూనిట్లు, మండల కేంద్రం తాళ్లూరు కెనరా బ్యాంక్ పరిధిలో స్లాబ్–1 కింద 4 యూనిట్లు, స్లాబ్–2 కింద 1 యూనిట్, ఈస్ట్ గంగవరం యూనియన్ బ్యాంక్ పరిధిలో స్లాబ్–1 కింద 4 యూనిట్లు, స్లాబ్–2 కింద 1 యూనిట్, స్లాబ్–3 కింద 1 యూనిట్ మంజూరైనట్లు పేర్కొన్నారు. మండలానికి మొత్తం 14 యూనిట్లు రూ.10 లక్షల సబ్సిడీతో రూ.10 లక్షల బ్యాంక్ లోన్ జత చేసి రూ.20 లక్షలకు టార్గెట్ కేటాయించినట్లు చెప్పారు. ఈ నెల 25వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఆయా బ్యాంకుల ఏరియా పరిధిలోని మైనారిటీలకు సంబంధించిన వారు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో విజ్ఞప్తి చేశారు.

చెస్ ఆటతో ఏకాగ్రత పెంపు



చెస్‌పై అవగాహన కల్పిస్తున్న గ్రంథపాలకుడు

పెద్దదోర్నాల: చెస్ ఆటతో ఏకాగ్రత పెంపొందించుకోవచ్చని లైబ్రేరియన్ వెంకట సుబ్బారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా విద్యార్థులకు చెస్‌పై అవగాహన కల్పించారు. దీంతో పాటు డాన్స్ పోగ్రాం, మాథ్స్ నేర్పిస్తారని గ్రంథపాలకుడు తెలిపారు. కార్యక్రమంలో ఫ్యాకల్టీ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

56 బస్తాల రేషన్ బియ్యం స్వాధీనం

కురిచేడు: పేదలకోసం ప్రభుత్వం రాయితీ పై సరఫరా చేస్తున్న బియ్యం అధికారపార్టీ కార్యకర్తలు పక్కదారి పట్టిస్తున్నారు. వాటిని ఎస్సై ఎం శివ పక్కాప్రణాళికతో కాపు కాసి పట్టుకున్నారు. ఎస్సై వివారల మేరకు.. మండలంలోని దేకనకొండ గ్రామానికి చెందిన పి శివరాం, ఎం శ్రీనులు బొలోరో వాహనంలో 56 బస్తాల బియ్యాన్ని రైస్‌మిల్లుకు అక్రమంగా తరలిస్తున్నతారు. పోలీసులు బయ్యవరం బ్రిడ్జి వద్ద వాహనాన్ని ఆపి తనిఖీ చేయగా అందులో పేదల బియ్యం ఉన్నట్లు కనుగొని అరెస్టు చేసినట్లు ఆయన తెలిపారు. వారిపై కేసు నమోదు చేసి బియ్యాన్ని ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులకు అప్పగించినట్లు ఎస్సై తెలిపారు.

ట్రాక్టర్‌తో పాటు పలు వస్తువుల చోరీ



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్‌ఐ సంతప్‌కుమార్

పుల్లలచెరువు: గుర్తుతెలియని దుండగులు ట్రాక్టర్‌తో పాటు పలు వస్తువులు చోరీ చేశారు. ఈఘటన మండలంలోని ముటుకుల, కొండారెడ్డి కోస్టాల గ్రామాల్లో జరిగింది. ఎస్సై సంపత్‌కుమార్ వివరాల మేరకు.. ముటుకుల, కొండారెడ్డి కోస్టాలు గ్రామాలకు చెందిన రైతులు ఇళ్లలో ఉన్న ట్రాక్టర్, ట్రాలీ, రోటావేటర్‌లను గుర్తు తెలియని వ్యక్తులు చోరి చేశారు. బాధితులు బీ శంకరరావు, వాగ్యానాయక్‌లు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లుగా ఎస్‌ఐ తెలిపారు. పోలీసులు చోరీ చేసిన ప్రాంతాన్ని పరిశీలించారు. దొంగలించిన సొత్తు విలువ సుమారు రూ.9 లక్షలు ఉంటుందని, నిందితులను పట్టుకుంటామని తెలిపారు.

ఎంపీడీవో విజయలక్ష్మికి సత్కారం

సంతనూతలపాడు: మండల పరిషత్ కార్యాలయంలో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా పనిచేస్తూ ఎంపీడీవోగా ఉద్యోగోన్నతి పొందిన ఈదర విజయలక్ష్మిని మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో సిబ్బంది సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో డీ సురేష్‌బాబు, పలువురు సిబ్బంది ఘనంగా సత్కరించారు. ఏడు నెలలపాటు విజయలక్ష్మి సంతనూతలపాడులో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా పనిచేశారు. ఉద్యోగోన్నతిపై పొదిలి ఎంపీడీవోగా ఆమె బదిలీ అయ్యారు. అయితే నూతన ఎంపీడీవో విజయలక్ష్మి మే 31వ తేదీన ఉద్యోగ విరమణ కానున్నారు.

పింఛన్ల గోడు పట్టేదెవరికి ?

- కూటమి ప్రభుత్వంలో అర్హులకు మొండిచేయి
- జిల్లా వైద్యశాల చుట్టూ తిరిగి అలసిన డయాలసిస్ పేషెంట్లు
- పట్టించుకోని పాలకులు



పింఛన్ అందుకుంటున్న వృద్ధురాలు (ఫైల్)

తాళ్లూరు: కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి దాదాపు 12 నెలలు అవుతున్నా అర్హులకు పింఛన్లు మంజూరు చేయడం లేదు. వితంతువులకు సైతం పింఛన్లు ఇవ్వక పోవడంతో అర్హులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంటి యాజమానిని కోల్పోయి బాధలో ఉంటూ పిల్లలను పోషించేందుకు పింఛన్ రూపంలో ఆర్థిక సాయం అందిచాల్సిన కూటమి ప్రభుత్వం ఒట్టి చేతులు చూపిస్తున్న పరిస్థితి నెలకొంది. మండలంలో డయాలసిస్ పేషెంట్లు 21 మంది ఉండగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కొందరిని అనర్హుల జాబితాలో చేర్చారు. వెలుగువారిపాలెం చెన్నారపు నాగమణి, ఈస్ట్ గంగవరం గుజ్జుల వేదాక్షరి, కొర్రపాటివారిపాలెంలో పులి పెద్ద ముసలయ్యలకు పింఛన్లు తొలగించారు. అదే గ్రామానికి చెందిన సంఘం కోటేశ్వరమ్మ (45) ఇటీవల కాలంలో కిడ్నీ సమస్యతో మరణించింది. ఆమెకు కూడా పింఛన్ గతంలో ఆపేశారు. అనారోగ్యంతో బాధపడుతున్న రోగులకు పింఛన్ తొలగించడం సరికాదని కూటమి ప్రభుత్వంపై అర్హుల కుటుంబ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చాలా సంవత్సరాలుగా అనారోగ్యంతో బాధపడుతూ పెన్షన్ తీసుకుంటున్న లబ్ధిదారులకు మళ్లీ సదరం సర్టిఫికెట్ అవసరమని, అందులో అర్హత ఉన్న వారికే పెన్షన్ వస్తుందని కూటమి ప్రభుత్వం చెబుతోందని రోగులు పేర్కొంటున్నారు. అనారోగ్య సమస్యతో బాధపడే పెన్షన్‌దారులు సదరం సర్టిఫికెట్ కోసం క్యూలైన్లో నిలబడలేక జిల్లా వైద్యశాల చుట్టూ అలసిపోయారు. వైద్యులు రోగుల ఇంటికి వచ్చి పరీక్షలు చేసి సదరం సర్టిఫికెట్‌కు అర్హత నిర్ధారించాలని రోగులు కోరుతున్నారు. కూటమి ప్రభుత్వం రోగులను ఇబ్బంది పెట్టడం సరికాదని ప్రజలు ప్రభుత్వం పనితీరుపై మండిపడుతున్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం డయాలసిస్ పేషెంట్లకు రూ.10 వేల పింఛన్ ఒకటో తేదీనే వలంటీర్ల ద్వారా అందించేదని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కొంత డబ్బు పెంచినట్లు చెప్పినా అది ఎక్కడా కార్యరూపం దాల్చలేదు. కూటమి నాయకులు బహిరంగ సభల్లో సంక్షేమ పథకాలు అందిస్తామని, అర్హులకు న్యాయం చేస్తున్నామని చెబుతున్నా వాటిని అమలు చేయడంలో ఇప్పటికీ విఫలమవుతునే ఉన్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం మేల్కొని అర్హత ఉన్న లబ్ధిదారులకు పింఛన్లు మంజూరు చేయాలని ఆయా గ్రామాల లబ్ధిదారులు కోరుతున్నారు.



కోటేశ్వరమ్మ (ఫైల్)

కూటమి ప్రభుత్వం అన్యాయం చేసింది



మా అమ్మ పేరు సంఘం కోటేశ్వరమ్మ (45). ఏడేళ్ల నుంచి కిడ్నీ సమస్యతో బాధపడుతూ పింఛన్ తీసుకుంటోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పింఛన్ తొలగించారు. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న మాకు మందులు కొనుక్కునేందుకు కూడా డబ్బులు లేక ఇబ్బందులు పడుతున్నాం. అనారోగ్యంతో ఇటీవల మా అమ్మ చనిపోయింది.

– సంఘం రాజేష్, కొర్రపాటివారిపాలెం

అర్హత ఉన్నా పింఛన్ కోల్పోయా



కిడ్నీ, సుగర్ సమస్యలతో పదేళ్ల నుంచి బాధపడుతున్నా. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నాకు రావాల్సిన పింఛన్ నిలిపేశారు. అధికారులు చెప్పినట్లు ఒంగోలు ప్రభుత్వ వైద్యశాలకు నాలుగు సార్లు వెళ్లినా ఎవరూ పట్టించుకోలేదు. ఓపిక లేకపోవడంతో మళ్లీ వెళ్లలేకపోయా. ప్రభుత్వం దయతలచి ఎప్పటిలాగే నాకు పింఛన్ వచ్చేలా చేయాలని కోరుకుంటున్నా.

– చెన్నారుపు నాగమణి, వెలుగువారిపాలెం

నా భర్త చనిపోయినా పింఛన్ అందడం లేదు



నా భర్త అంగవైకల్యంతో పింఛన్ పొందేవాడు. నా భర్త చనిపోయి 11 నెలలు అవుతోంది. ఇప్పటి వరకు నాకు పింఛన్ అందడం లేదు. ఊరిలో ఉన్న హోటల్ నడుపుకుంటూ జీవనం కొనసాగిస్తున్నా. ప్రభుత్వం స్పందించి పింఛన్ అందేలా చూడాలని ప్రభుత్వాన్ని కోరుకుంటున్నా.

– సావిశెట్టి పద్మ, బెల్లంకొండవారిపాలెం

అంగన్‌వాడీ కేంద్రంలో పాఠశాల సంసిద్ధత ఉత్సవం

కురిచేడు: స్థానిక నుసుం బజారులోని అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం పాఠశాల సంసిద్ధత ఉత్సవాన్ని ఎంపీడీఓ బి.సతీష్‌బాబు, జిల్లా ఐటీసీ ప్రథమ్ కో ఆర్డినేటర్ ఎస్.వెంకట్రావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సీహెచ్ సుభాషిణిలు ప్రారంభించారు. 3–5 సంవత్సరాల పిల్లలను అంగన్‌వాడీ కేంద్రానికి తప్పకుండా పంపాలని ఎంపీడీఓ సతీష్‌బాబు కోరారు. గ్రామంలో చిన్నారులతో ర్యాలీ నిర్వహించారు. పాఠశాల సంసిద్ధత ఉత్సవంలో పూర్వ ప్రాథమిక విద్య పూర్తి చేసిన పిల్లలు తమ తల్లిదండ్రుల సమక్షంలో రిజిస్ట్రేషన్ స్టాల్ వద్ద పేర్లు నమోదు చేసుకున్నారు. పిల్లలు జూన్ 12న ప్రథమ తరగతిలో చేరేలోపు ఎటువంటి అభ్యాసంపై దృష్టి సారించాలన్న విషయాన్ని జిల్లా ఐటీసీ ప్రథమ్ కో ఆర్డినేటర్ ఎస్.వెంకట్రావు వివరించారు. అంగన్‌వాడీ కేంద్రంలో ఐదేళ్లు పూర్తి చేసిన వారందరికీ గ్రాడ్యుయేషన్ డే నిర్వహించి వారిని సర్టిఫికెట్లతో సత్కరించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, తల్లులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



ర్యాలీ ప్రదర్శన నిర్వహిస్తున్న అంగన్‌వాడీలు

18 నుంచి ఉచిత కరాటే శిక్షణ

ఒంగోలు: బాలికలకు, మహిళలకు ఉచిత కరాటే శిక్షణ ఇవ్వనున్నట్లు జపాన్ కరాటే అసోసియేషన్ జిల్లా చీఫ్ కోచ్, అధ్యక్షులు టీశ్రీనివాసరెడ్డి, టి.జయశ్రీరెడ్డిలు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 5 సంవత్సరాల వయస్సు పైబడిన 45 సంవత్సరాలలోపు మహిళలు ఇందుకు అర్హులు. వీరికి నాంచాక్ (కరాటే వెపన్ శిక్షణ) కార్యక్రమం స్థానిక డాక్టర్ పర్వతరెడ్డి ఆనంద్ మినీ స్టేడియంలో ఇవ్వనున్నట్లు తెలిపారు. శిక్షణ ఈనెల 18 నుంచి 31వ తేదీవరకు ఉదయం 6 గంటల నుంచి 8 గంటల వరకు నిర్వహిస్తామన్నారు. పూర్తి వివరాలకు 83417 58692 నంబర్‌లో సంప్రదించాలని ప్రకటనలో పేర్కొన్నారు.

సూర్య ఘర్‌తో విద్యుత్ వెలుగులు..

- పీఎం సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ యోజన
- గృహ విద్యుత్ బిల్లులు ఆదా చేసుకునేందుకు మంచి అవకాశం
- ఇంటి పైకప్పుపై సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటు
- సబ్సిడీ అందిస్తున్న కేంద్ర ప్రభుత్వం



ఒంగోలు సబర్బన్: ప్రస్తుత ఆధునిక కాలంలో విద్యుత్ వినియోగం అమాంతం పెరిగిపోయింది. ఇంట్లో ప్రతి చిన్న పనికి విద్యుత్‌ను అధికంగా వినియోగిస్తుంటాం. దీంతో విద్యుత్ బిల్లులు తడిసిమోపడవుతుంటాయి. దీని నంచి బయటపడేందుకు కేంద్ర ప్రభుత్వం 'ప్రధాన మంత్రి సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ యోజన'ను కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టింది. జిల్లాలోని గృహ విద్యుత్ వినియోగదారులకు ఇదో సదవకాశం. ఆంధ్రప్రదేశ్ మధ్య ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ(ఏపీ సీపీడీసీఎల్) అవకాశాన్ని అందుబాటులోకి తీసుకొచ్చిందని జిల్లా ఏపీసీపీడీసీఎల్ ఎస్ఈ కట్టా వెంకటేశ్వర్లు మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. గృహ విద్యుత్ బిల్లులో ఆదా చేయాలనుకుంటే ఈ పథకం ఎంతో ప్రయోజనకరమన్నారు. మీ ఇంటి పైకప్పు మీద సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటుకు ఇప్పుడు ప్రభుత్వం సబ్సిడీ అందిస్తుంది. ముఖ్యంగా ఏసీలు, గీజర్లు వాడి అధిక విద్యుత్ వినియోగించే విద్యుత్ వినియోగదారులకు ఎంతో ఉపయోగం. ఈ పథకానికి తక్కువ వడ్డీకే అన్ని బ్యాంకులు రుణాలు అందిస్తున్నాయి. వినియోగదారుడు 5 నుంచి 6 సంవత్సరాల్లో మూలధన వ్యయాన్ని తిరిగి పొందుతారు. దరఖాస్తు కోసం, మరిన్ని వివరాలకు పీఎం సూర్య ఘర్ వెబ్‌సైట్‌ని సందర్శించవచ్చు. స్థానిక విద్యుత్ సిబ్బందిని కాని, సమీప విద్యుత్ కార్యాలయాన్ని కానీ, టోల్ ఫ్రీ నంబర్ 1912న కానీ, ప్రకాశం జిల్లా ఎల్ఎమ్‌సీ నంబర్ 94408174914 సంప్రదించవచ్చు.

సామర్థ్యం (లోడ్)	యూనిట్లు	ప్రస్తుతం వస్తున్న బిల్లు	నెలకు వచ్చే బిల్లు	ఆదా	అయ్యేఖర్చు	రాయితీ
1 కిలో వాట్	120	రూ.500	రూ.100	రూ.400	రూ.80 వేలు	రూ.30 వేలు
2 కిలో వాట్	240	రూ.900	రూ.150	రూ.750	రూ.1.30 లక్షలు	రూ.60 వేలు
3 కిలో వాట్	360	రూ.2400	రూ.200	రూ.2200	రూ.1.90 లక్షలు	రూ.78 వేలు
4 కిలో వాట్	480	రూ.3550	రూ.250	రూ.3300	రూ.2.50 లక్షలు	రూ.78 వేలు
4 కిలో వాట్	600	రూ.4750	రూ.300	రూ.4450	రూ.3.10 లక్షలు	రూ.78 వేలు

లాభాలు ఇలా..

- విద్యుత్ బిల్లు ఆదా అవుతుంది.
- ఇంటి పైకప్పు చల్లగా ఉంటుంది.
- వాడకానికి మించి ఉత్పత్తి చేస్తే మిగులు విద్యుత్‌ని విద్యుత్ సంస్థలకు అమ్మడం ద్వారా ఆదాయం సంపాదించవచ్చు.
- పర్యావరణాన్ని రక్షించండంలో భాగస్వాములు అవ్వచ్చు.
- ఈ పథకం కేవలం గృహ వినియోగదారులకు మాత్రమే.
- ఒక కిలో వాట్ సామర్థ్యం కలిగిన సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటు చేసుకోవటానికి కనీసం 10 చదరపు మీటర్ల స్థలం అవసరం అవుతుంది.

ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలి



ఆర్టీసీ బస్టాండ్‌ను సందర్శించిన జోనల్ చైర్మన్ సురేష్ రెడ్డి

ఒంగోలు టౌన్: ఆర్టీసీ ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మెరుగైన సౌకర్యాలను కల్పించాలని ఆర్టీసీ జోనల్ చైర్మన్ సన్నారెడ్డి సురేష్ రెడ్డి చెప్పారు. మంగళవారం ఆయన ఒంగోలు ఆర్టీసీ డిపోను సందర్శించారు. డిపో పరిసరాలు, ప్రయాణికుల గ్యాలరీని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వేసవి కాలం ఎండలు మండిపోతున్నందున డిపోలో ప్రయాణికులు ఇబ్బంది పడకుండా చూడాలని సూచించారు. ఫ్యాన్లు సరిగా తిరగకపోవడం, తగిన న్ని ఫ్యాన్లు లేకపోవడం గమనించిన ఆయన వెంటనే ఫ్యాన్లు బిగించాల్సిందిగా ఆదేశించారు. డిపో పరిసరాలలో పరిశుభ్రంగా ఉంచాలని, డిపో నుంచి రాకపోకలు సాగించే ప్రయాణీలకు తాగునీటి ఇబ్బంది కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని చెప్పారు. అలాగే పార్శిల్ సరీ్వసులో అనేక లోపాలు జరుగుతున్నాయని, కష్టమర్లు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. పార్శిల్ లోపాలను సరిదిద్దాలని ఆదేశించారు. కార్యక్రమంలో రీజనల్ మేనేజర్ సత్యనారాయణ, డిపో మేనేజర్ డి.శ్రీనివాసులు, కమర్షియల్ ఏటీఎం ఇన్‌చార్జి శివరామకృష్ణ, యూనియన్ నాయకులు రాధాకృష్ణ ఉన్నారు.

శిద్దా వెంకటేశ్వరరావుకు శుభాకాంక్షలు



శుభాకాంక్షలు తెలుపుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

చీమకుర్తి రూరల్: కృష్ణసాయి గ్రానైట్ అధినేత శిద్దా వెంకటేశ్వరరావు జన్మదిన వేడుకలు కృష్ణసాయి గ్రానైట్ ఆవరణలో ఘనంగా నిర్వహించారు. కుటుంబ సభ్యులు వారి తల్లి హైమావతి, సతీమణి సూర్యకుమారి, అశిష్, గ్రానైట్ వర్కర్స్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. అనంతరం రక్తదాన శిబిరం ప్రారంభించి 30 మంది రక్తదానం చేశారు. పాదాచారుల దాహార్తి తీర్చేందుకు రోడ్డుపై చలివేంద్రం ప్రారంభించారు. గ్రానైట్ వర్కర్స్‌కు బోనస్ ఇచ్చారు. ఈ సందర్భంగా పలువురు వైఎస్సార్ సీపీ మండలపార్టీ అధ్యక్షుడు పమిడి వెంకటేశ్వర్లు, జెడ్పీటీసీ వేమా శ్రీనివాసరావు, డాక్టర్ బొడ్డపాటి హరిబాబు, ఎర్రగుంట్ల మోహన్ డీ రామచంద్రారెడ్డి, రాజా, రాంబాబు, కమలాకర్, అప్పారావు, మురళి, ఆంజనేయులు తదితరులు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు.

పొలాల్లో భూసార పరీక్షలు చేయాలి



పుచ్చకాయలపల్లిలో మాట్లాడుతున్న ఏఓ బుజ్జిబాయి

పెద్దారవీడు: రైతులు తమ పొలాల్లో భూసార పరీక్షలు చేయించుకోవాలని వ్యవసాయాధికారి కె.బుజ్జిబాయి సూచించారు. మండలంలోని పుచ్చకాయలపల్లిలో భూసార పరీక్షలపై రైతులకు మంగళవారం అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ పొలాల్లో మట్టి నమూనాలు సేకరించే ప్రక్రియపై పలు సూచనలు చేశారు. భూసార పరీక్షలతో కలిగే ప్రయోజనాల గురించి వివరించారు. భూసార పరీక్షలు చేయిస్తే పొలాల్లో నత్రజని, బాస్వరం, పొటాష్ ఎంత మోతాదులో ఉన్నాయో తెలుస్తుందని చెప్పారు. మట్టి నమూనాలను పరీక్షలు నిర్వహించి ఫలితాలు తెలియజేస్తామని తెలిపారు. దీంతో ఎరువుల వాడకం తగ్గుతుందని స్పష్టం చేశారు. వేసవిలో దుక్కులు దున్నుకుంటే నేలలో ఉత్తమ నీటి నిల్వ సామర్థ్యం పెరుగుతుందని, వర్షపు నీరు భూమిలోకి ఇంకి భూగర్భ నీటి మట్టం పెరుగుతుందని తెలిపారు. ముందుగా దుక్కు దున్నితే నేలలోకి నీరు బాగా ఇంకి భూమి గుల్ల బారుతుందని చెప్పారు. అంతే కాకుండా గతంలో వేసిన పంట తాలూకా వ్యర్థాలు నేలలో కలిసి సేంద్రియ ఎరువుగా మారుతుందని వివరించారు. వీఏఏ లాలూనాయక్, రైతులు పాల్గొన్నారు.

వైభవంగా వేణుగోపాలుడి కల్యాణం

యర్రగొండపాలెం: రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాల స్వామి కల్యాణం మంగళవారం వేకువ జామున అంగరంగ వైభవంగా జరిగింది. విశాఖ నక్షత్రయుక్త పుష్కరాంశమున మిల్లంపల్లి వేణుగోపాల స్వామి కల్యాణాన్ని అన్నమరాజు, యక్కలి వంశస్థుల ఆధ్వర్యంలో వేదపండితులు కొండవీటి వేణుగోపాల చార్యులు, బొడ్డు పవన్‌కుమార్ శర్మ, అన్నమరాజు రమేష్‌బాబు కనుల విందుగా నిర్వహించారు. మహోత్సవానికి వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పాల్గొని కల్యాణాన్ని తిలకించారు. అనంతరం స్వామి వారిని ఉదయం సూర్యవాహనం, రాత్రి సింహ వాహనంపై పట్టణంలో ఊరేగించారు. కార్యక్రమాలను దేవస్థానం అధ్యక్షుడు యక్కలి బాలవెంకటేశ్వర్లు పర్యవేక్షించారు.



ప్రత్యేక అలంకరణలో వేణుగోపాల స్వామి

చెరుకూరి శ్రీను మృతికి ఏఐటీయూసీ నివాళి

దర్శి (కురిచేడు): ఆర్‌డబ్ల్యూఎస్ డిపార్ట్‌మెంట్లో కాంట్రాక్ట్ ఉద్యోగిగా పనిచేస్తూ ఏఐటీయూసీ కార్మిక సంఘంలో కీలకపాత్ర పోషిస్తున్న చెరుకూరి శ్రీను మృతిపై ఏఐటీయూసీ మంగళవారం ఘనంగా నివాళులర్పించింది. ఈ సందర్భంగా సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ఎం.రమేష్‌బాబు మాట్లాడుతూ చెరుకూరి శ్రీను అంకిత భావంతో కార్మికుల సమస్యలపై మాట్లాడే వారని పేర్కొన్నారు. శ్రీను మృతి ఏఐటీయూసీకి తీరని లోటని తెలిపారు. శ్రీను మృతదేహంపై ఏఐటీయూసీ జెండాను జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కె.హనుమంతురావు, ఆర్‌డబ్ల్యూఎస్ జిల్లా కార్యదర్శి సింగరకొండ శ్రీనులు కప్పి పూలమాల వేసి నివాళులర్పించారు. వారి కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. శ్రీను కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఆర్.కరుణానిధి, బీకేఎంయూ నాయకులు జూపల్లి కోటేశ్వరరావు, ఆర్‌డబ్ల్యూఎస్ నాయకులు విజయ్, ఆరునూరి బాబు, ఖాశీం, కార్మికులు పాల్గొన్నారు.



శ్రీను మృతికి నివాళులర్పిస్తున్న నాయకులు

అర్జీల పరిష్కారంలో సిబ్బంది చొరవ చూపాలి

ఒంగోలు సబర్బన్: అర్జీల పరిష్కారంలో సిబ్బంది చొరవ చూపాలని ఒంగోలు అర్బన్ తహశీల్దార్ పిన్నిక మధుసూదన్ సూచించారు. మంగళవారం ఆయన నూతన తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన వెంటనే ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. అర్బన్, రూరల్ ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారులతో నేరుగా మాట్లాడి అర్జీలను స్వీకరించారు. వచ్చిన అర్జీలను డీటీ కొల్లిబోయిన అశోక్‌కుమార్, రూరల్ డిప్యూటీ తహశీల్దార్ శ్రీనివాసులు, ఒంగోలు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శ్రీకంఠ శ్రీనివాసరావులతో చర్చించారు. ఎవరి పరిధిలో ఉన్న సమస్యలను వెంటనే పరిష్కారం చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రతి సోమవారం వీఆర్వోలు అందరూ విధిగా తహశీల్దార్ కార్యాలయానికి రావాలన్నారు. అప్పుడే గ్రీవెన్స్ రోజు వచ్చే అర్జీదారులకు సరైన న్యాయం చేయగలమని సూచించారు. అంతకు ముందు ఒంగోలు అర్బన్ తహశీల్దార్‌గా ఆయన బాధ్యతలు స్వీకరించారు. మధుసూదన్‌రావు కొత్తపట్నం తహశీల్దార్‌గా విధులు నిర్వర్తిస్తూ బదిలీపై ఇక్కడకు వచ్చారు. కొత్తపట్నం ఎఫ్ఏసీ ఇన్‌చార్జ్‌గా కూడా కొనసాగుతున్నారు. ఇక్కడ పనిచేసిన అర్బన్ తహశీల్దార్ నేలభట్ల వాసు వెలిగండ్లకు బదిలీపై వెళ్లారు.



అర్జీలను పరిశీలిస్తున్న అర్బన్ తహశీల్దార్ మధుసూదన్

సైన్స్‌తోనే మానవ వికాసం సాధ్యం



చిన్నారులు చేత మ్యాజిక్ చేయిస్తున్న మెజీషియన్ రామన్

సంతనూతలపాడు: సైన్స్‌తోనే మానవ వికాసం సాధ్యమవుతుందని.. మూఢ నమ్మకాలు నమ్మకుండా ఉండాలని జేవీవీ నాయకులు పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రం సంతనూతలపాడు సుందరయ్య భవన్‌లో జేవీవీ, ఐద్వా ఆధ్వర్యంలో ప్రకాశం బాలోత్సవంలో భాగంగా ఐదో రోజు ప్రముఖ మెజీషియన్ బీవీ రామన్ మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా మ్యాజిక్‌పై శిక్షణ నిచ్చారు. ఈ సందర్భంగా కర్పూరం వెలిగించి నోట్లో వేసుకోవడం, నిప్పుల్లో నడవడం మహిమ కాదని నిరూపించి చేసి చూపించారు. అలాగే దెయ్యాలను బెలూన్లలో బంధించి అవి లేవని నిరూపించారు. కార్యక్రమంలో జేవీవీ నాయకులు కోదాటి కోటేశ్వరరావు ఐద్వా మండల కార్యదర్శి ఎస్ మాలతి, చిన్నారులు పాల్గొన్నారు.